## క్లుప్తంగా

### చౌడేశ్వరిదేవి ఆలయానికి విరాళం


అర్చకులకు విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి నెల్లూరు జిల్లా రాచవారిపల్లి గ్రామానికి చెందిన మోతుకూరి వెంకటకృష్ణ, విష్ణు సంహిత దంపతులు రూ.25,116 విరాళం అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి సోమవారం తెలిపారు. ఈ మేరకు దాతలను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

### మల్లికార్జునస్వామి ఆలయంలో విశేష పూజలు


స్వామి వారికి పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండలంలోని హెచ్ కొట్టాల సమీపంలోని ముచ్చట్ల భ్రమరాంభ, మల్లికార్జున స్వామి ఆలయంలో ఆశ్వయుజ మాస సందర్భంగా సోమవారం విశేష పూజలు జరిగాయి. ఆలయ అర్చకుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహా మంగళహారతి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

### ధ్వజస్తంభం ఏర్పాటుకు భూమి పూజ


భూమి పూజ చేస్తున్న దృశ్యం

అవుకు(కొలిమిగుండ్ల): పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయ ఆవరణలో కంచి ప్రమాచార్య జగద్గురువు విజయేంద్రస్వామి అనుగ్రహంతో ధ్వజస్తంభం ఏర్పాటుకు సోమవారం భూమి పూజ చేసినట్లు ఆలయ పూజారి శంకర శర్మ తెలిపారు. కార్తీక పౌర్ణమి రోజున ధ్వజస్తంభాన్ని ఏర్పాటు చేసి ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ధ్వజస్తంభ దాత శంకర్‌శర్మ, తెలుగు రామప్ప, పాశం వెంకటేశ్వర్లు, కానాసి భాస్కర్ పాల్గొన్నారు.

### లారీని ఢీకొన్న కారు



కొలిమిగుండ్ల: మండలంలోని అంకిరెడ్డిపల్లె సమీపంలో ఉన్న తుమ్మలపెంట క్రాస్ రోడ్డులో సోమవారం కారు లారీని ఢీకొనడంతో ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. ప్యాపిలి మండలం పోదొడ్డికి చెందిన కృష్ణమూర్తి కొలిమిగుండ్ల నుంచి స్వగ్రామానికి బయలు దేరాడు. మార్గ మధ్యలోని తుమ్మలపెంట క్రాస్ రోడ్డు వద్దకు చేరగానే కారు టైర్ పేలి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణమూర్తి స్వల్పగాయాలతో బయట పడ్డాడు. స్థానికులు అక్కడికి చేరుకుని వాహనాన్ని పక్కకు తీసి గాయపడిన అతన్ని తాడిపత్రికి తరలించారు.

### 23న జాబ్‌మేళా

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న జరగనున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ లలిత సూచించారు. సోమవారం కళాశాలలో పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. మేళాలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, 10వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు 86886 51650, 97059 98056 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### నాసిరకంగా మైదానాల పనులు


ఆర్డీఓ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న నేతలు

డోన్ టౌన్: విద్యార్థుల భవిష్యత్ కోసం నిర్మించాల్సిన క్రీడా మైదానాలను టీడీపీ నాయకులు ఆదాయ వనరులుగా మలిచారని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివన్న, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, ఏబీవీపీ కన్వీనర్ రవిశేఖర్ ఆరోపించారు. సోమవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ అంజన్‌బాబుకు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో క్రీడా మైదానాల నిర్మాణం కోసం ప్రభుత్వం విడుదల చేసిన రూ.10 లక్షల్లో కేవలం లక్ష రూపాయలతోనే నాసిరకం పనులు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## నకిలీ మద్యంతో

# పేదల జీవితాలతో చెలగాటం

- నకిలీ మద్యానికి వ్యతిరేకంగా నినదించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- డోన్‌లో ర్యాలీ, ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం



డోన్‌లో నిరసన ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

డోన్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కూటమి నేతలు పేద, మధ్యతరగతి ప్రజలను మత్తులో ముంచి కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదిస్తున్నారని వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, పార్టీ అధికార ప్రతినిధి మురళీకృష్ణ, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్‌లు ఆరోపించారు. చిత్తూరు జిల్లా మొలకలచెరువు, గుంటూరు జిల్లా ఇబ్రహీంపట్నంలో వెలుగుచూసిన నకిలీ మద్యం తయారీ ఘటనలకు నిరసనగా, పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం డోన్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుగ్గన స్వగృహం నుంచి ఎక్సైజ్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ సాగింది. కల్తీ మద్యం తయారీ, విక్రయాలను అరికట్టాలని ఎక్సైజ్ సీఐ వరలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు సోమేష్ యాదవ్, మల్లికార్జునరెడ్డి, పిట్టల జాకీర్, పార్టీ నాయకులు మల్యాల శ్రీనివాసరెడ్డి, విశ్వనాథరెడ్డి, కుడిమెట్ల నారాయణ, ఎద్దులన్న, దినేష్‌గౌడ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి తదితరులు మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిందంటే నకిలీ మద్యం ఊపందుకుంటుందని తెలిపారు. అధికారులు మత్తులో జోగుతుంటే పేదలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**బైండోవర్ కేసులు ఎక్కడ?**

2019కి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో డోన్ మండలం ఉడుములపాడు గ్రామంలో టీడీపీ నాయకులు నకిలీ మద్యం తయారుచేస్తూ పట్టుబడిన ఘటనను గుర్తుచేశారు. అప్పటి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేఈ ప్రతాప్‌తో పాటు 36 మందిపై నకిలీ మద్యం తయారీ కేసులు ఉన్నా, ఇప్పటికీ ఒక్క బైండోవర్ కేసు కూడా పెట్టలేని అసమర్థ ప్రభుత్వం రాష్ట్రంలో ఉందని విమర్శించారు. ఆ పార్టీ అధినేత చంద్రబాబే నకిలీ మద్యం తయారు చేసుకునేందుకు పరోక్షంగా లైసెన్సులు అందజేస్తున్నారని ఆరోపించారు. మద్యంబాబుల బలహీనత, పేదల ప్రాణాలను పణంగా పెట్టి ఆ పార్టీ కార్యకర్తలు ప్రతి గ్రామంలో బెల్టుషాపులు పెట్టి నకిలీ మద్యాన్ని విక్రయిస్తుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని మండిపడ్డారు.

**ఆఫ్రికాను కాదు ఆంధ్రా ప్రజలను కాపాడండి**

ఆఫ్రికా దేశాల్లో నకిలీ మద్యం తయారీ మూలాలను కనుగొని ఆ దేశ ప్రజలను రక్షించే బాధ్యత తనపై పడిందని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబునాయుడు ముందుగా మన రాష్ట్ర ప్రజలను నకిలీ మద్యం బారిన పడి ప్రాణాలు పోకుండా కాపాడాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా తంబళ్లపల్లె టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దాసరపల్లి జయచంద్రారెడ్డి, ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి, టీడీపీ నాయకులు కట్టా సురేంద్రనాయుడు, జనార్దన్‌రావ్‌లతో పాటు పాలకొల్లు, అనకాపల్లి జిల్లా పరవాడ టీడీపీ నాయకుడు రత్తల రాముకు ఆ పార్టీతో కాక మరెవరికీ సంబంధాలు ఉన్నాయో సీఎం వెల్లడించాలని డిమాండ్ చేశారు.


ఎక్సైజ్ సీఐ వరలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు

**డైవర్షన్ పాలిటిక్స్ బాబుకు అలవాటే**

టీడీపీ ఎప్పుడైనా ఇబ్బందుల్లో పడితే ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ పాలిటిక్స్ నడపడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని పోస్టుపసాద్, మురళీకృష్ణ అన్నారు. వైఎస్సార్‌సీపీకి టీడీపీ నాయకులు కోవర్టులుగా పనిచేస్తున్నారని ప్రజలను మభ్యపెట్టడం, నకిలీ మద్యం మూలాలు ఆఫ్రికాలో ఉన్నాయని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించే కుట్రలో భాగమని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాలుట్ల రఘురాం, రాజ్‌కుమార్, మిట్టా రవి, పాతపేట రఫి, కటిక వేణు, గద్దం సురేష్, మహేంద్రనాయుడు, నాగిరెడ్డి, సర్పంచ్ జయచంద్ర, ఆర్ట్ రమణ, క్రిష్ణ, రఫి, రమణ, శేఖర్ యాదవ్, రవి, అశోక్, సురేష్, హుసేన్ పాల్గొన్నారు.

## కూటమి పాలనలో యథేచ్ఛగా నకిలీ మద్యం


బనగానపల్లె ఎక్సైజ్ పోలిస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ కమలాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బనగానపల్లె: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో యథేచ్ఛగా నకిలీ మద్యం లభిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కల్ర హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. కల్తీ మద్యానికి నిరసనగా సోమవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆదేశాల మేరకు బనగానపల్లెలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీ చేపట్టారు. పార్టీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి ఇంటి నుంచి ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎక్సైజ్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ కమలాకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం విక్రయాలు పెరిగిపోయాయని తెలిపారు. ఇందుకు నిదర్శనమే చిత్తూరు జిల్లా మొలకలచెరువు, ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో బయటపడ్డ వేలాది నకిలీ మద్యం బాటిళ్లు, లేబుల్స్ అన్నారు. కూటమి పాలనలో ఇప్పటివరకు సుమారు 421 మంది నకిలీ, కల్తీ మద్యం వల్ల మరణించినట్లు చెప్పారు. నకిలీ మద్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాడు జె బ్రాండ్ అన్న కూటమి నేతలు నేడు ఏ బ్రాండో చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్రంలో నకిలీ మద్యం తయారీ, విక్రయాలపై సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నకిలీ మద్యం గుట్టు తేల్చేందుకు వైన్‌షాపులు, పర్మిట్ రూమ్‌లు, బార్లు, బెల్టు షాపుల్లో ఎక్సైజ్ శాఖ విస్తృత తనిఖీలు చేపట్టాలని కోరారు. కల్తీ మద్యం వల్ల మరణించిన వారిని గుర్తించి వారి కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందించాలని, వైన్‌షాపుల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలను బయటపెట్టి అనర్హులను గుర్తించాలన్నారు. ఎక్సైజ్ కార్యాలయం ముందు మహిళలు నకిలీ మద్యాన్ని పారబోసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి అంబటి రవికుమార్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి అత్తార్ జాహెద్, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్ధంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, ఎంపీపీ మానస వీణ, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నీలి శ్రీనివాసులు, రామసుబ్బారెడ్డి, పార్థసారథిరెడ్డి, మోహన్‌బాబు, సురేష్, రామకృష్ణ, ఈశ్వర్‌నాయక్, శంకర్‌నాయక్, దేవుడు, యూనుస్, దస్తగిరి, వలి, మద్దయ్య, తిరుపాల్, చౌడయ్య, నాగరాజు, బుర్రా శంకర్, ఉప్పలపాడు శంకర్, మాబుసా, రఘునాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఆంధ్రుల అన్నపూర్ణాదేవి డొక్కా సీతమ్మ


డొక్కా సీతమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

డోన్ టౌన్: ఆంధ్రుల అన్నపూర్ణాదేవి డొక్కా సీతమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కళారత్న డాక్టర్ తొగట సురేష్‌బాబు, స్ఫూర్తి సేవా సంస్థ అధ్యక్షుడు ఆలా మధు పిలుపునిచ్చారు. సీతమ్మ జయంతి సందర్భంగా సోమవారం స్థానిక 100 పడకల ప్రభుత్వాస్పత్రిలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. దాత వాల్మీకి సురేష్ సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సీతమ్మ నిత్యాన్నదాన సేవా తపన, దాతృత్వం చిరస్మరణీయమని, ఆమె చూపిన మార్గంలో నడిచి సేవా భావాన్ని కొనసాగించడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ, సంస్థ సభ్యులు భాస్కర్, సురేష్, మౌలాలి, శివయ్య, మహమ్మద్, మధు, మౌలాలి పాల్గొన్నారు.

### విర్చో సేవలు చిరస్మరణీయం


విర్చో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూపరింటెండెంట్

డోన్ టౌన్: వైద్యశాస్త్రంలో ఎన్నో ఆవిష్కరణలు చేసి పాథాలజీకి పునాదులు వేసిన శాస్త్రవేత్త రుడాల్ఫ్ విర్చో సేవలు చిరస్మరణీయమని ప్రభుత్వ ఆస్పత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రాంబాబు, డాక్టర్ సుకుమార్, సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ అన్నారు. విర్చో జయంతిని పురస్కరించుకుని సోమవారం స్థానిక వంద పడకల ఆస్పత్రిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.

## ఆలయ పునర్నిర్మాణానికి విరాళం


సర్పంచ్‌కు విరాళం అందజేస్తున్న దాత సుంకన్న,


బేతంచెర్లలో విరాళం అందజేసిన దాత

డోన్ టౌన్: మండలంలోని బి.బింతిరాళ్ల గ్రామంలో పునర్నిర్మిస్తున్న సుంకులమ్మ ఆలయానికి డాక్టర్ సుంకన్న తన వంతు సాయంగా రూ.50 వేలు విరాళం ఇచ్చారు. సోమవారం సర్పంచ్ రవిమోహన్‌ను కలిసి విరాళం అందజేశారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.

- బేతంచెర్ల: మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో దేవాలయ అభివృద్ధికి స్థానిక దాతలు విరాళాలు అందించారు. గ్రామానికి చెందిన కె. ఎల్లయ్య కుమారులు శివశంకర్, రవిశంకర్ దుర్గమ్మ ఆలయ అభివృద్ధికి రూ.10 వేలు, పునర్నిర్మించిన చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి రూ. 50 వేలు విరాళంగా అందజేశారు. ఆలయ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదం అందజేసి దాతలను శాలువాతో సత్కరించారు.

### మృతదేహం వెలికితీత

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం.పెండేకల్లు గ్రామంలో ఉన్న కప్పల బావిలో ఈతకు వెళ్లి కుల్లాయి(22) అనే యువకుడు ఆదివారం గల్లంతైన విషయం తెలిసిందే. సోమవారం బావిలో నీటిని మోటర్ల ద్వారా బయటకు పంపి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

## బఫర్ జోన్‌లో భవనాల నిర్మాణం తగదు

డోన్ టౌన్: ప్రభుత్వాన్ని తప్పుదారి పట్టించి కాలువల బఫర్ జోన్‌లో కార్యాలయాలు నిర్మిస్తున్న టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు రంగనాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ అంజన్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. వెంకటనాయునిపల్లె గ్రామంలోని వాగు భూమిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం వల్ల ఇరిగేషన్ కాలువలు మూసుకుపోయాయని, భవిష్యత్‌లో రికార్డులు, ప్రజా ఆస్తులకు నష్టం కలగవచ్చన్నారు. బఫర్ జోన్ హద్దులను గుర్తించి ప్రభుత్వ భూములను రక్షించాలని, లేకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు దొరపల్లె రాజు, ఓబులేశు, సురేష్, వలి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శివపార్వతుల పల్లకీ సేవ

బనగానపల్లె: మండలంలోని యాగంటి ఉమామహేశ్వరస్వామి పల్లకీ సేవను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ఏకశిలారూపంలో కొలువైన శివపార్వతులకు అభిషేకం, అర్చన, తదితర పూజలు జరిగాయి. సాయంత్రం స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

### నేడు సబ్సిడీ శనగ విత్తనాల పంపిణీ

కోవెలకుంట్ల: స్థానిక మార్కెట్‌యార్డు ఆవరణలో రబీ సీజన్‌కు సంబంధించి మంగళవారం నుంచి రైతులకు సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు ఏఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కోవెలకుంట్ల మండలంలో ఈ ఏడాది 9,200 హెక్టార్లలో రైతులు పప్పుశనగ సాగు చేయాల్సి ఉందన్నారు. రైతులకు 25 శాతం సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేసేందుకు వెయ్యి క్వింటాళ్ల విత్తనాలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వం క్వింటాకు రూ.7,800 నిర్ణయించగా 25 శాతం రాయితీ పోను రైతులు రూ. 5,850 చెల్లించాల్సి ఉందన్నారు. రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### కలచట్లలో పట్టపగలే చోరీ

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల గ్రామంలో ఆదివారం పట్టపగలే చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రైతు రాజేష్ ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. తాళం పగులగొట్టి ఇంటిలోకి చొరబడిన దుండగులు బీరువా లాకర్‌ను పగులగొట్టారు. బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాలకు మేలు

కోవెలకుంట్ల: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లింగన్న అన్నారు. సోమవారం కోవెలకుంట్లలోని పలు వ్యాపార సముదాయాలను సందర్శించి జీఎస్టీ తగ్గింపుపై వ్యాపారులు, ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గతంలో ఉన్న 5,12,18,24 శాతం ఉన్న జీఎస్టీ స్లాబ్‌లను ఇటీవల తగ్గించిందని తెలిపారు. దీని వల్ల వ్యవసాయ ఉత్పత్తులు, యంత్ర పరికరాలు, ఔషధాలు, పాల పదార్థాల ధరలు, విద్యకు సంబంధించి నోట్ పుస్తకాలు, పేపర్స్, ప్రింటర్స్, ల్యాప్‌టాప్, తదితర వస్తువల ధరలు తగ్గాయన్నారు. జీఎస్టీ తగ్గడం వల్ల వినియోగం పెరిగి దేశ ఆర్థిక పరిస్థితి అభివృద్ధి చెందుతుందన్నారు. పార్టీ నాయకులు ఆంజనేయులు, సీతారామయ్య, ఎంపీ సుబ్బయ్య పాల్గొన్నారు.

### జూదరుల అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తిలో సోమవారం నలుగురు పేకాట రాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సమాచారం మేరకు.. గ్రామ శివారులోని ముళ్లపొదల్లో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు దాడి చేశారు. వారి వద్ద నుంచి పేక ముక్కలు, రూ. 43,500 నగదు స్వాధీనం చేసుకుని జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### మాజీ ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు


అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

ప్యాపిలి: పట్టణంలోని ప్రియదర్శిని పాఠశాల విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. జాన్సన్ పబ్లికేషన్స్ సంస్థ ఇటీవల నిర్వహించిన టాలెంటోత్సవ్‌లో పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొనగా.. వారిలో అన్సర్, మైథిలి, రాంచరణ్ ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని దాశరథి ఆడిటోరియంలో నిర్వహించిన ఫైనల్స్‌లో విద్యార్థులు అకడమిక్, ఆర్ట్స్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. దీనిపై హెచ్‌ఎం పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు.

## విధుల్లో చేరిన కొత్త ఉపాధ్యాయులు


డోన్: ఎంఈఓకు జాయినింగ్ రిపోర్టు అందజేస్తున్న నూతన ఉపాధ్యాయులు


బేతంచెర్ల: నూతన ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు


బనగానపల్లెలో నూతన ఉపాధ్యాయులు

డోన్ టౌన్: డీఎస్సీ ద్వారా ఎంపికైన 43 మంది ఉపాధ్యాయులు సోమవారం మండల విద్యాధికారి ప్రభాకర్ వద్ద జాయినింగ్ రిపోర్టులు సమర్పించారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలలకు 40 మంది, హైస్కూల్‌లకు ముగ్గురిని జిల్లా విద్యాధికారి కేటాయించారు. ప్రతి ఉపాధ్యాయుడు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ సూచించారు.

**ప్యాపిలిలో 87 మంది..**

ప్యాపిలి: డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. కొత్తగా 87 మంది ఉపాధ్యాయులు ఎంపిక కాగా సోమవారం 51 మంది విధుల్లో చేరినట్లు ఎంఈఓలు మహేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్ నాయక్‌లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్త ఉపాధ్యాయులతో ఎంఈఓలు సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేసి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలని సూచించారు. సీఆర్పీలు రామాంజనేయులు, రాంబాబు, నవీన్, మురళి పాల్గొన్నారు.

**కొలిమిగుండ్లలో 56 మంది**

కొలిమిగుండ్ల: డీఎస్సీ ద్వారా ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. కొలిమిగుండ్ల మండలంలో 56, అవుకు మండలంలో 53 మంది ఉపాధ్యాయులు ఎమ్మార్సీ కార్యాలయాలకు చేరుకుని ఆర్డర్ కాపీలతో పాటు పలు వివరాలు నమోదు చేసి ఎంఈఓలకు అందజేశారు. అనంతరం మాన్యువల్, వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలు ఎంపిక చేసుకున్న ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు ఆయా పాఠశాలలకు వెళ్లి విధుల్లో చేరారు. పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కొత్త ఉపాధ్యాయలకు స్వాగతం పలుకుతూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

**బేతంచెర్లలో 59 మంది..**

బేతంచెర్ల: మండలంలో 59 మంది నూతన ఉపాధ్యాయులు బాధ్యతలు తీసుకున్నట్లు ఎంఈఓ సోమశేఖర్ తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎస్జీటీలు-43, జెడ్పీ హైస్కూల్‌లలో హిందీ-5, తెలుగు-1, వ్యాయామ ఉపాధ్యాయులు-10 ఉన్నట్లు పేర్కొన్నారు.ఒకఎస్జీటీ విధుల్లో చేరాల్సి ఉందన్నారు.

**ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి**

బనగానపల్లె రూరల్: ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణే ధ్యేయంగా కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించాలని ఎంఈఓ స్వరూప సూచించారు. మండలంలోని పలు పాఠశాలల్లో డీఎస్సీ ద్వారా నియామకం పొందిన 24 మంది ఉపాధ్యాయులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో కొత్త ఉపాధ్యాయులకు ఘన స్వాగతం పలికారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంపొందించే బాధ్యత ఉపాధ్యాయులదేనని అన్నారు. యూటీఎఫ్ జిల్లా సహ అధ్యక్షుడు సత్యప్రకాష్, మండల అధ్యక్షుడు ఎస్. ప్రతాప్, ఎంఈఓ-2 శ్రీనివాసులు పాల్గొన్నారు.

## వర్షపు నీటిలో కూర్చొని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకుడు

ప్యాపిలి: మండల పరిధిలోని గార్లదిన్నె గ్రామంలో ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతింది. భారీ వర్షం కురిసినప్పుడు రోడ్డుపై వరదనీరు చేరి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు రమేశ్ సోమవారం వర్షపు నీటిలో కూర్చుని నిరసన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి నీరు రోడ్డుపై నిలువకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కూటమి నాయకుడే ప్రభుత్వ తీరుపై నిరసన చేపట్టడం చూస్తే రోడ్ల ఎంతటి దయనీయ స్థితిలో ఉన్నాయో అర్థమవుతుంది.